వంద శాతం పన్ను వసూలులో డీలా

- 2022-23లో 15 పంచాయతీల్లో వంద శాతం వసూలు
- 2023-24లో 12 పంచాయతీలు, 2024-25లో 11 పంచాయతీలు
- గత ప్రభుత్వంలో 24 పంచాయతీల్లో బకాయిలు రూ.6.04 లక్షలు
- కూటమి ప్రభుత్వంలో మొదటి ఏడాది బకాయిలు రూ.18.18 లక్షలు


పెనుమల్లి గ్రామం

పెడన: గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్నుల వసూలులో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బకాయిలు ఆమాంతంగా పెరిగిపోయాయి. ఏకంగా మూడు రెట్లు బకాయిలు పడ్డాయి. వైఎస్సార్ సీపీ హయాంలో మండలంలోని 24 పంచాయతీలు 2022-23లో రూ.3.63 లక్షలుంటే 2023-24లో రూ.6.04 లక్షలకు చేరింది. ఆ తరువాత ఎన్డీయే అధికారపగ్గాలు చేపట్టిన తరువాత 2024-25లో 24 పంచాయతీల బకాయిలు రూ.18.18 లక్షలకు చేరింది. వసూలు చేసినా బకాయిలు బాగా పేరుకుపోతుండటం కొసమెరుపు. వంద శాతం వసూలు చేసిన పంచాయతీలు తగ్గుతూ రావడం గమనార్హం. వైఎస్సార్ సీపీ హయాంలో 15 పంచాయతీలు వంద శాతం వసూలు చేస్తే ఇప్పుడున్న ప్రభుత్వం హయాంలో కేవలం 11 పంచాయతీలు మాత్రమే వంద శాతం వసూలు చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అరకొరగా ఉండటంతో పాటు పనిభారం అధికంగా ఉండటంతో వసూలుపై దృష్టి సారించడం లేదన్నట్లు తెలుస్తోంది. పన్నుల వసూళ్లలో వెనుకబడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ ఏడాదికి ఆ ఏడాది పన్నులు సక్రమంగా వసూలు చేసి పురోగతిలో ఉంచుకోవాల్సిన పరిస్థితి పెడన మండలంలో కనబడడం లేదు.

2022–23లో 15 పంచాయతీలు

2022–23 ఆర్థిక సంవత్సరంలో పెడన మండలంలో 24 పంచాయతీల్లో 15 పంచాయతీలు వంద శాతం పన్నులు వసూలు చేశాయి. అచ్చయ్యవారిపాలెం, చేవేంద్ర, చోడవరం, గురువిందగుంట, జింజేరు, కమలాపురం, కొంగంచర్ల, కొప్పల్లి, మడక, ముచ్చర్ల, నందమూరు, నేలకొండపల్లి, పెనుమల్లి, పుల్లపాడు, శేరివత్తర్లపల్లి పంచాయతీలున్నాయి. 35.31 శాతం వసూలు చేసి కొంకేపూడి పంచాయతీ వెనుకంజలో నిలిచింది. ఈ ఏడాదిలో 85.53 శాతం పన్నులు వసూలు చేశారు. డిమాండ్ రూ.45.45 లక్షలుంటే రూ.38.87లక్షలు వసూలు అయ్యాయి.

2023–24లో 12 పంచాయతీలు

2023–24 ఆర్థిక సంవత్సరంలో అచ్చయ్యవారిపాలెం, బల్లిపర్రు, చోడవరం, గురువిందగుంట, జింజేరు, కమలాపురం, కొంగంచర్ల, కొప్పల్లి, ముచ్చర్ల, నేలకొండపల్లి, పెనుమల్లి, శేరివత్తర్లపల్లి పంచాయతీలున్నాయి. ఈ బల్లిపర్రు మినహా మిగిలిన 11 పంచాయతీలు కూడా గతేడాది వంద శాతం వసూలు చేసిన వాటిల్లో నిలిచాయి. ఈ సంవత్సరంలో లంకలకలువగుంట పంచాయతీ కేవలం 13.35 శాతం పన్నులు మాత్రమే వసూలు చేసి చిట్టచివరిన నిలిచింది. ఆ తరువాత స్థానాల్లో కొంకేపూడి 15.42 శాతంతో సరిపెట్టుకుంది. ఈ ఏడాదిలో డిమాండ్ రూ.52.40 లక్షలుంటే రూ.34.22లక్షలు వసూలు చేయగలిగారు.

2024–25లో 11 పంచాయతీలు

ఎన్డీయే అధికార పగ్గాలు చేపట్టిన తరువాత మండలంలోని 24 పంచాయతీల్లో 11 పంచాయతీలు మాత్రమే వంద శాతం పన్నులు వసూల్లు చేయగలిగాయి. చోడవరం, గురువిందగుంట, జింజేరు, కాకర్లమూడి, కమలాపురం, కొంగంచర్ల, కొప్పల్లి, లంకలకలువగుంట, ముచ్చర్ల, పెనుమల్లి, శేరివత్తర్లపల్లి పంచాయతీలున్నాయి. ఉరివి 80.8 శాతంతో వెనుకబడింది. డిమాండ్ రూ.70.64 లక్షలుంటే వసూలు చేసింది రూ.63.25 లక్షలు.

పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి..



వాస్తవంగా గత ఐదేళ్లగా పన్నులు వసూళ్లు పరిశీలిస్తే ముందంజలోనే ఉన్నాం. 2024–25 ఏడాదిలో సార్వత్రిక ఎన్నికల అనంతరం పన్నుల వసూలు పెరిగాయి. అంతకు ముందు సంవత్సరం మీచాంగ్ తుఫాన్ ప్రభావంతో పన్నులు కట్టడానికి ఆసక్తి చూపలేదు. దీంతో ఆ ఏడాది పన్నులు వసూలు మందకొడిగానే అయ్యాయి. ఆ తరువాత ఏడాది 2024–25లో డిమాండ్‌కు చేరువలోకి రావడం జరిగింది. పన్నులు వసూలు బాగానే జరుగుతున్నాయి. సచివాలయ సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు. ప్రతి సంవత్సరం చివరలో పన్నులపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– ఎండీ ఫర్హాతుల్లా, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ, పెడన మండలం

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజ



నాగాయలంక: వైశాఖ షష్టి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని పురాతనమైన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ అర్చకత్వంలో వేకువ జామునే ప్రత్యేక అలంకరణ, పూజాదికాలు జరిపి భక్తులకు పర్వదినాల విశిష్టతను వివరించారు. తొలుత స్వామి వారికి వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. విశేష పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాదచారులకు చెప్పుల పంపిణీ



మచిలీపట్నంటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన శ్రీ సత్య సాయి చలివేంద్రంలో మంచినీరు, మజ్జిగతో పాటు రహదారిలో నడిచి వెళుతున్న చెప్పులు లేని పాదచారులకు చెప్పులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు మంచినీటిని అందించడమే కాకుండా చెప్పులు లేని పేదలకు చెప్పులు అందజేశామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ఎస్.నాగమణి, వనజ, కొట్టి నాగమణి, శ్రీ సత్య సాయి చలివేంద్ర సమన్వయకర్త బి.శైలజ, వై.సాయిబాబు, కూరాళ్ల అనిల్, అనుమకొండ వెంకటేశ్వరరావు, పి.వరప్రసాద్ పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా మట్టి తరలింపుపై జరిమానా



పెడన: అనుమతుల్లేకుండా మట్టిని విక్రయానికి తోలుతున్న ట్రాక్టర్‌ను ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి శనివారం పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి హెచ్చరించి వదిలేయడంతో శనివారం ఉదయం మళ్లీ యథావిధిగా మట్టిని తోలుతుండటంతో పట్టుకుని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. హెచ్చరించినా కూడా మట్టిని తోలుతుండటంతో రూ.5 వేలు ఫైన్ విధించామని ఆర్ఐ తెలిపారు. అనధికారికంగా మట్టిని తరలిస్తే ఫైన్ విధిస్తామని ఈసందర్భంగా ఆమె పేర్కొన్నారు.

గ్రామాల్లో కాపు సంఘం ఐక్యతా సమావేశాలు

నాగాయలంక: మండల శ్రీకృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాపు ఆధిక్యత కలిగిన గ్రామాల్లో ఐక్యతా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి), ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు శనివారం చెప్పారు. కాపుల సంక్షేమంలో భాగంగా ప్రధానమైన కాపు కల్యాణ మండపాలను తక్షణమే నిర్మాణం చేపట్టాలని, కాపుల సామాజికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేయాలని, రాజకీయాలకు అతీతంగా కాపుల సంక్షేమమే లక్ష్యంగా ఐక్యతతో ముందుకు సాగాలని గ్రామ స్థాయి సమావేశాల్లో తీర్మానాలు ఆమోదిస్తున్నామన్నారు. ఇప్పటికే మండలంలోని బర్రంకుల, గణపేశ్వరం, భావదేవరపల్లి, తలగడదీవి, పెదపాలెం, ఏటిమొగ గ్రామాల్లో ఐక్యతా సమావేశాలు పూర్తి చేశామన్నారు. గ్రామాల్లో సన్నాహక సమావేశాలు ముగిశాక మండల స్థాయిలో భారీగా కాపు ఐక్యతా ర్యాలీ జరిపి, నాగాయలంకలో మహాసభ నిర్వహిస్తామని నాయకులు తెలిపారు.

టిప్పర్, ట్రాక్టర్ ఢీ : డ్రైవర్లకు గాయాలు



గూడూరు: విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై గూడూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం కాపారం నుంచి మచిలీపట్నం వస్తున్న ఇటుకల ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న ఇసుక టిప్పర్ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ట్రాక్టర్ తిరగబడింది. వేగాన్ని అదుపు చేయలేక టిప్పర్ కూడా డివైడర్‌ను దాటుకుంటూ రోడ్డుకు అవతల వైపునకు వెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్, టిప్పర్ డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


కొడాలిలో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న విద్యార్థులు


ఘంటసాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

ఘంటసాల: గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని ఘంటసాల, కొడాలి గ్రంథాలయాధికారులు ఎం.శరత్ కుమార్, ఎం.సుబ్బారావు తెలిపారు. ఘంటసాల, కొడాలి గ్రంథాలయాల్లో కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఘంటసాల గ్రంథాలయంలో విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్ చెప్పిన అనంతరం యోగా నేర్పించారు. కొడాలి గ్రంథాలయంలో విద్యార్థులచే కథలు పుస్తకాలు చదివించి వారికి నచ్చిన కథలను చెప్పించారు. అనంతరం ఎ.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న శిక్షణ తరగతులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. స్థానిక పోర్ట్ రోడ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో లైబ్రేరియన్ శిరీష విద్యార్థులకు కథలు చెప్పారు. విద్యార్థులు పలు పుస్తకాలను చదివారు. స్పోకెన్ ఇంగ్లిష్, గణితం తదితర అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్యారమ్స్, చెస్, కోకో వంటి ఆటలు ఆడారు. కార్యక్రమాలను జిల్లా కేంద్ర ఉప గ్రంథాలయ అధికారి ఎన్‌వీడీటీ నగేష్ పర్యవేక్షించారు. నగరంలోని చింతగుంటపాలెం హౌసింగ్ బోర్డ్ కాలనీ, చిలకలపూడి, ఈడేపల్లి శాఖ గ్రంథాలయాల్లోనూ వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించారు.


శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

మండలంలో పర్యటించిన పేర్ని కిట్టు


కోనలో బాబూరావు పాడె మోస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శనివారం మండలంలో పర్యటించారు. బందరు మండలం మేకవానిపాలెం పంచాయతీ శివారు హమాని కాలనీకి చెందిన నీలవేణి అనే మహిళ ఉపాధి హామీ పనులకు వెళ్లి గుండెపోటుకు గురై మరణించింది. విషయం తెలుసుకున్న కిట్టు హుటాహుటిన గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. జరిగిన దుర్ఘటన పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలి కుటుంబానికి పార్టీ కార్యకర్తలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అంతిమ కార్యక్రమం పూర్తి అయ్యే వరకు దగ్గరుండి అన్ని చూసుకోవాలని సూచించారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరిన ఆయన కోన గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు బాబూరావు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పేర్ని కిట్టుతో పాటు మాజీ జెడ్పీటీసీ లంకె వెంకటేశ్వరరావు, నాయకులు పాండురంగారావు, మద్దెల పాండురంగారావు, సయ్యద్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క


గాంధీనగరం వద్ద గుర్రపుడెక్కతో నిండిపోయిన పంట కాలువ

కృత్తివెన్ను: ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే ప్రధాన పంటకాలువ గుర్రపుడెక్క, తూటికాడతో నిండిపోయింది. ఇటీవల కృత్తివెన్ను మండలానికి తాగునీటి అవసరాల కోసం పంట కాలువకు నీటిని విడుదల చేశారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోని తాగునీటి చెరువులను ఈ నీటితోనే నింపుకోవాలి. ప్రస్తుతం గాంధీనగరం నుంచి కృత్తివెన్ను వరకు దాదాపు మూడు కిలోమీటర్లు మేర గుర్రపుడెక్క కాలువలో పేరుకుపోయింది. ఎగువ నుంచి వచ్చే వ్యర్థాలు, జంతు కళేబరాలు ఈ చెత్తలో చిక్కుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. దిగువనున్న గ్రామాల్లోని చెరువులకు ఈ నీటినే నింపాల్సి వస్తోంది. దీనివల్ల ఈ కలుషిత నీరు చెరువుల్లోకి వెళ్తోంది. ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం వివిధ కార్యక్రమాల పేరుతో ప్రచారం చేస్తున్న ప్రభుత్వాధికారులు దీనిపై దృష్టిపెట్టకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు లక్ష్మీపురంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

చల్లపల్లి: మండల పరిధిలోని లక్ష్మీపురం సీతారామాలయంలో శ్రీహనుమత్ లక్ష్మణ సమేత సీతారాముల నూతన శిలా విగ్రహాల పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్నిదానం, శాంతి హోమాలు నిర్వహించి ఉదయం 7.02 గంటలకు విగ్రహాలను ప్రతిష్ఠిస్తామన్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు టేకుపల్లిలో మన్యసూక్త హవనం

టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ బాల పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 108 ఆమృతులతో మన్యసూక్త హవనం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భారతదేశంపై ఉగ్రవాదం నశించాలని, సనాతన ధర్మం పరిరక్షించబడాలని, విశ్వశాంతి సంకల్పంతో ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు భగీరథ మహర్షి జయంతి

చిలకలపూడి(మచిలీపట్నం): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతిని ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి జి.రమేష్ శనివారం తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఆదివారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీతో పాటు ఇతర సంక్షేమ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. సగర, ఉప్పర కులానికి చెందిన సంఘ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు యార్లగడ్డలో వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ల పంపిణీ

చల్లపల్లి: 108 నిముషాల్లో 108 రౌండ్లు సూర్య నమస్కారాలు చేసి ప్రపంచ రికార్డు నెలకల్పిన సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని యార్లగడ్డలో సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యోగా గురువు నాగరాజు తెలిపారు. ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాల యోగ చైతన్య యాత్రలో భాగంగా మహాసూర్య వందనం -2025 పేరుతో ఏప్రిల్ 4వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అరకులో 21,850 మందిలో 108 నిముషాల్లో 108 రౌండ్లు సూర్యనమస్కారాలు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి చల్లపల్లి మండలం నుంచి ముగ్గురు యోగా గురువులతోపాటు మరో 14 మంది మొత్తం 17 మంది పాల్గొన్నారు. యార్లగడ్డలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(హోమియో ఆస్పత్రి) వద్ద ఈ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు


దేవరకోటలో మట్టి నమూనాలు సేకరిస్తున్న డాక్టర్ సుధారాణి, శాస్త్రవేత్త వెంకటలక్ష్మి

దేవరకోట(ఘంటసాల): భూసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల మండలం దేవరకోట గ్రామంలో కేవీకే శాస్త్రవేత్తల బృందం మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ముఖ్య ఉద్దేశంపై నైపుణ్య ప్రదర్శనలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్షల వలన కలిగే ఉపయోగాలు, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం గురించి వివరించారు. సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. మట్టి పరీక్షలు చేయడం వలన ఉదజని సూచిక, లవణ సూచిక, నత్రజని, భాస్వరం, పోటాష్, సూక్ష్మ పోషకాలు ఎంత మోతాదులో ఉంటాయో తెలుస్తుందన్నారు. సమస్యాత్మక నేలలు గురించి మట్టి పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. నైపుణ్య ప్రదర్శనలతో గ్రామంలో మట్టి నమూనాలు సేకరించడం జరిగిందని ఆయా నమూనాలను కేవీకే భూసార పరీక్ష కేంద్రంలో భూసార పరీక్షలు చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌కు దిశానిర్దేశం చేయాలి


ఎస్ఆర్‌వైఎస్‌పీ విద్యార్థులను సత్కరిస్తున్న సురేష్‌బాబు తదితరులు

చల్లపల్లి: ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పటానికే పరిమితం కాకుండా పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు వారి తల్లిదండ్రులతో మమేకమై సలహాలు, సూచనలు ఇస్తూ భాగస్వాములు కావాలని ఎస్టీ, ఎస్సీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక ఎస్ఆర్ వైఎస్‌పీ పాఠశాల విద్యార్థులు డి.రమ్య(541), అద్దంకి వీరరాజేశ్వరి(541) ఇళ్లకు వెళ్లి శనివారం స్వీట్లు అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులు సాధించే ప్రగతిని గుర్తిస్తూ ఉపాధ్యాయులు ప్రోత్సాహకాలు అందించి భుజం తట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై పిల్లల తల్లిదండ్రులకు ఎప్పుడైతే నమ్మకం కలుగుతుందో అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళాడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తెనాలి శ్రీరాములు, మట్టా రాజు, కె.ఆంజనేయులు, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించండి

జమీదగ్గుమిల్లి(పామర్రు): ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణ పేర్కొన్నారు. మండలంలోని పిరది జమీదగ్గుమిల్లిలోని ఉపాధి హామీ కూలీలతో ఆయన శనివారం మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌లో తగినంత నిధులు కేటాయించకుండా కూలీలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. యంత్రాలతో పని చేయించి సిమెంట్ రోడ్డు ప్రభుత్వ భవనాలు నిర్మించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం కోసం, పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పన కోసం ఈ నెల 5వ తేదీన మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ఉపాధి కూలీలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కిశోర వికాసం శిక్షణ తరగతుల ప్రారంభం


చల్లపల్లిలో శిక్షణ ఇస్తున్న ఫెసిలిటేటర్ లావణ్య తదితరులు


పెడనలో అవగాహన కల్పిస్తున్న ఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ సిబ్బంది

చల్లపల్లి: బాలికలకు ఎదురయ్యే సమస్యలను, మంచి, చెడులను ముందుగానే వివరించటం ద్వారా భవిష్యత్‌లో వారు సమయస్ఫూర్తిగా వ్యవహరించేందుకు అవకాశం ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదిలక్ష్మి అన్నారు. కిశోర వికాసం వేసవి శిక్షణ తరగతులను స్థానిక పార్వతమ్మతోటలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. ఈనెల 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో వారానికి రెండు రోజుల చొప్పున తరగతులు నిర్వహిస్తామన్నారు. మొదటి సెషన్‌లో భాగంగా మహిళా సంరక్షణా కార్యదర్శి వేమూరి లావణ్య కార్యక్రమం ఫెసిలిటేటర్‌గా వ్యవహరించి తొలుత కౌమార బాలికల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పిల్లల్లో నాయకత్వపు లక్షణాలను పెంపొందించేందుకు వారిని కొన్ని గ్రూపులుగా విభజించి ఒక్కొక్క గ్రూపునకు లీడర్లను నియమించి వారు చేయవలసిన పనులను వివరించారు. పిల్లలతో బిడియాన్ని పోగొట్టేందుకు వారితో పాటలు పాడించి, ఆటలు ఆడించి స్టెప్పులేయించారు. తరగతి గదిలో పాటించవలసిన నియమాలను శిక్షణలో వివరించారు. వేసవి దృష్ట్యా ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను గురించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పెడన: ఐసీడీఎస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం పట్టణంతో పాటు మండలంలోని వార్డు, గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్లు నిండిన బాలికలకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయా సచివాలయాల పరిధిలోని కిశోర బాలికలను సమావేశ పరిచి పలు అంశాలపై బాల్య వివాహాలు, ఆరోగ్యం, అపరిచితుల పట్ల ఎలా నడుచుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురుకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అలా వివాహాలు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగినా, జరుగుతున్నా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అందుబాటులో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు లేదా మహిళా సంరక్షణ కార్యదర్శులు(మహిళా పోలీసులు) సమాచారం అందించాలని తెలిపారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, చదువు ఉన్నప్పుడే గుర్తింపు వస్తుందని, ఉన్నత స్థాయిలో నిలుస్తారని సూచించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. చిరుధాన్యాల ఉపయోగాలను వివరించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌కేలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

యువ క్రీడాకారులను ప్రోత్సహించాలి



గుడివాడ టౌన్: ప్రతిభగల యువ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మండలి హనుమంతరావు అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో క్రికెట్ పోటీల్లో కప్ సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల రెల్లి కులస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళగిరిలో జరిగిన అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో గుడివాడకు చెందిన రాజ్ సీసీ జట్టు ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానం చేజిక్కించుకున్నారు. దీంతో క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జట్టు కెప్టెన్ ఆకుల మహేష్, క్రీడాకారులు ధనాల ఫణీంద్ర, ముత్యాల రాజేష్, ఫణి, లక్కి, చిన్ని, వైఎస్సార్ సీపీ నాయకుడు కె. ఆంజనేయ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.